క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు శివదినేష్


విద్యార్థి శివదినేష్

పొదలకూరు : రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పట్టణంలోని విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి ఎం.శివదినేష్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జి.కామాక్షి తెలిపారు. నెల్లూరు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వారు శుక్రవారం నిర్వహించిన అండర్–19 పోటీల్లో ప్రతిభ కనబరిచిన శివదినేష్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం నిర్వహించే టెన్నిస్ బాల్ క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటారు. ఈ సందర్భంగా శనివారం శివదినేష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు మాల్యాద్రి, సుస్మిత, మౌనిక, ఈశ్వర్‌రెడ్డి, శ్రీహరి, ఇందిర, హసన్, అబిద్, క్రాంతి అభినందించారు.

వైభవంగా పల్లకిసేవ


పల్లకిసేవలో స్వామి అమ్మవార్లు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల పల్లకిసేవ శనివారం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా జె.కృష్ణమూర్తి–విజయ దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

కల్యాణ వెంకటేశ్వరునికి..

పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామికి శనివారం పల్లకిసేవ నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆల్తుర్తిలో పూరిళ్లు దగ్ధం

పొదలకూరు : మండలంలోని ఆల్తుర్తి గ్రామంలో శనివారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. గిరిజన కాలనీకి చెందిన గడ్డం సంజీవయ్య, ఇండ్ల పెంచలయ్యలకు చెందిన పూరిళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుని పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో గృహోపకరణాలతో పాటు బీరువాలో రూ.5 వేల నగదు కూడా కాలిబూడిదైంది. బాధితులు కట్టుబట్టలతో మిగలడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఎస్సైకు సత్కారం



విడవలూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన పి.నరేష్‌ను మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముదివర్తి నాయకులు కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, ఆడపాల చక్రిరెడ్డి, వరిణి సర్పంచ్ రావెళ్ల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు : 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పొదలకూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ) కోర్సుల్లో నాలుగో విడత ప్రవేశాలకు ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రిన్సిపల్ బి.మురళీధర్ బుధవారం తెలిపారు. ఈనెల 26వ తేదీ లోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించుకోవాల్సిందిగా సూచించారు. సూయింగ్ టెక్నాలజీ(8వ తరగతి పాస్, ఏడాది కాలపరిమితి), కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(10వ తరగతి పాస్, ఏడాది కాలపరిమితి), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్(10వ తరగతి పాస్, రెండేళ్ల కాలపరిమితి), హార్టికల్చర్(10వ తరగతి పాస్, ఏడాది కాలపరిమితి) ఉంటుందన్నారు. ఈనెల 27వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా వెల్లడించారు. నాలుగో విడత కౌన్సెలింగ్‌కు ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు సోమశిల మార్గం చిట్టేపల్లి తిప్ప వద్ద నూతన కళాశాల భవనం వద్దకు హాజరు కావాల్సిందిగా సూచించారు.

మొక్కుబడిగా ‘ఇది మంచి ప్రభుత్వం’


మాట్లాడుతున్న సోమిరెడ్డి

మనుబోలు : మండలంలోని వడ్లపూడి గ్రామంలో శనివారం జరిగిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మొక్కుబడిగా చేశారు. నిజానికి ప్రజాప్రతినిధులు ఇంటింటికీ తిరిగి వంద రోజుల పాలనపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంది. అయితే సోమిరెడ్డి మొక్కుబడిగా నాలుగైదు ఇళ్లు తిరిగి సభ పెట్టి ముగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.1.10 కోట్లతో రెండు వంతెనలను సాగునీటి కాలువలపై నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. బండేపల్లి బ్రాంచ్ కెనాల్ పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి ఆటోల బెడద


ఆర్టీసీ బస్సుకు అడ్డంగా నిలిపి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో


బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ఆటో డ్రైవర్

- బస్టాండ్‌లో విచ్చలవిడిగా ఆటోలు
- ఆర్టీసీ కంట్రోలర్ లేకపోవడం వల్ల పెరిగిన ఆటోలు
- ప్రతినిత్యం ఆర్టీసీ ఆదాయానికి గండి
- ప్రమాదమని తెలిసినా ఆటోలు ఎక్కుతున్న ప్రజలు

పొదలకూరు : ఆర్టీసీకి ఆటోల బెడద అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల వల్ల బస్సులు వెళ్లలేకపోతున్న విషయం తెలిసిందే. ఫలితంగా ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రమాదమని తెలిసినా ఆటోలను తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కుతున్నారు. అయితే పొదలకూరు పట్టణంలో సైతం ప్రయాణికులు ఆటోలు ఎక్కి జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వెళ్తున్నారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆర్టీసీకి సంబంధించిన నెల్లూరు, గూడూరు, రాపూరు, ఆత్మకూరు డిపో బస్సులు వచ్చి వెళ్తుంటాయి. పొదలకూరు నుంచి నెల్లూరుకు బస్సులు ఆశించిన స్థాయిలోనే ఉన్నాయి. అయితే బస్సులు వరుసగా రావడం లేదా మధ్యలో సమయం తీసుకోవడం వల్ల ఆటోలు బస్టాండ్‌లోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. ఇది చాలాకాలంగా జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రయాణికులు తమకున్న సమయాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సుల కోసం వేచి ఉండలేక ఆటోలను ఎక్కి వెళ్తున్నారు. ముఖ్యంగా ఉదయం వేళల్లో ఇలాంటి తంతు జరుగుతోంది. ఫలితంగా ఆర్టీసీకి రావాల్సిన ఆదాయాన్ని ఆటో డ్రైవర్లు పట్టుకుపోతున్నారు.

కంట్రోలర్ ఉండాలి

బస్టాండ్‌లో ఆర్టీసీకి సంబంధించిన కంట్రోలర్ ఉంటే ఆటోలకు కొంతవరకు కళ్లెం వేసేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో బస్టాండ్‌లో కంట్రోలర్ ఉండేవారు. ఆయన బస్టాండ్‌లోకి ఆటోలను రానీయకుండా ప్రయాణికులను నిలువరించి ఆర్టీసీ బస్సుల్లోకి ఎక్కించేవారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం పోకుండా, సురక్షితమైన ప్రయాణం ఉండేది. కంట్రోలర్ లేకపోవడం వల్ల విచ్చలవిడిగా ఆటోలు వచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. కొందరైతే బస్సుల ముందే ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నారు. ఆటోల ప్రయాణం సురక్షితం కాదని ఆర్టీసీ అధికారులు ఎన్ని పర్యాయాలు చెబుతున్నా ప్రయాణికులు వినడం లేదు. బస్సులు సకాలంలో బస్టాండ్‌కు రావడం లేదని. అందువల్లే ఆటోల్లో వెళ్తున్నామని సమాధానం ఇస్తున్నారు.

గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను అనుసరించడం ముఖ్యం

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు


మాట్లాడుతున్న విజయభాస్కరరావు

వెంకటాచలం : ఔషధ పరిశ్రమలో గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలను అనుసరించడం చాలా ముఖ్యమని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఔషధ పరిశ్రమలో గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో గ్రీన్ కెమిస్ట్రీ సూత్రాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలియజేశారు. తక్కువ వ్యర్థాలతో పర్యావరణానికి హాని లేకుండా ఉన్నత స్థాయి ఔషధాలను ఉత్పత్తి చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో చాలా అవసరమని వివరించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ పర్యావరణ హితం, సురక్షితమైన ఔషధ ఉత్పత్తి ప్రక్రియలు, సేంద్రియ రసాయన శాస్త్రంలో తాజా పరిణామాలపై ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్ అవకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విజయవాడ వరద బాధితుల కోసం కోవూరు, కావలి నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు రూ.9.20 లక్షల ఆర్థిక సాయం అందించారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో దీనిని అందజేశారు. ఈ సందర్భంగా అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మాట్లాడుతూ విజయవాడ ప్రజలు వరద వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. వారిని ఆదుకోవడానికి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ముందుంటాయని వివరించారు. అందులో భాగంగా ఇటీవల ప్రైవేటు ఉపాధ్యాయులు విజయవాడకు వెళ్లి బాధితులకు దుప్పట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అపస్మా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుబల్లిలో యథేచ్ఛగా మట్టి తరలింపు

- పట్టుకోవాల్సిన పోలీసులే రక్షణగా ఉన్న వైనం


పోలీసుల సమక్షంలో తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నియోజకవర్గంలో ఎక్కడా మట్టి తవ్వకాలకు అనుమతి లేదని అధికారులు చెబుతున్నారు. అయినా రాత్రుళ్లు ఇష్టారాజ్యంగా వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామంలో పోలీసులు దగ్గరుండి మరీ మట్టి ట్రాక్టర్లను తరలిస్తున్న ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెనుబల్లికి చెందిన టీడీపీ నేతలు పెంచలయ్య, సురేష్‌రెడ్డి, సుధాకర్‌ల ఆధ్వర్యంలో గ్రామ పొలాల నుంచి రాత్రి వేళ యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. నిఘా ఉంచి ట్రాక్టర్లను పట్టుకుని బాధ్యులపై కేసులు నమోదు చేయాల్సిన పోలీసులు ట్రాక్టర్లను దగ్గరుండి మరీ పంపించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో మండలాధికారులు, పోలీసులకు భారీ స్థాయిలో ముడుపులు అందడంతోనే పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు అంటున్నారు. మట్టి తరలిస్తున్న వారిని పట్టించుకోవద్దని కిందిస్థాయి పోలీసు సిబ్బందికి బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ కార్యాలయం నుంచి మౌఖిక ఆదేశాలు అందాయని, అందుకనే పోలీసుల ముందే టీడీపీ నాయకులు మట్టిని తరలిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు పట్టించుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేసి ధుని పూజ చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. యారాశి సాయికృష్ణ, శ్రావణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

సమస్యలను పరిష్కరించాలి


పంటపాళెంలో చేపడుతున్న చెత్త తొలగింపు పనులు

ముత్తుకూరు : పామాయిల్ ఫ్యాక్టరీల ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పంటపాళెం సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. పంటపాళెంలో శనివారం జరిగిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో 12 పామాయిల్ ఫ్యాక్టరీల ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొని, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా నార సంచులు సరఫరా చేయాలని ఫ్యాక్టరీల ప్రతినిధులను కోరారు. ఎంపీటీసీ సభ్యుడు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, నాయకులు పల్లంరెడ్డి రామ్మోహనరెడ్డి, నంగా చెంగారెడ్డి, పార్లపల్లి దిలీప్‌రెడ్డి, మాదినేని మల్లికార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘కోస్టల్ క్లీనప్ డే’


ముత్తుకూరు : చెత్త ఏరుతున్న కోస్టుగార్డు అధికారులు, ప్రతినిధులు


ముత్తుకూరు : శుభ్రం చేసిన తరువాత కృష్ణపట్నం సముద్ర తీరం

- తీర ప్రాంతాల్లో చెత్త ఏరివేత

తోటపల్లిగూడూరు : మండలంలోని కోడూరు సాగరతీరంలో ‘ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే’ శనివారం ఉత్సాహంగా జరిగింది. సాగరమిత్ర మత్స్యకార ప్రతినిధులు, బాల రక్షా భారత్ ఫిషరీష్ సంస్థ ఆధ్వర్యంలో చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి తీరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ క్రమంలో కోడూరు సాగర తీరం ప్రధాన మార్గం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర చెత్తా చెదారాలను తొలగించి బీచ్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట మత్స్యశాఖాధికారి సంజయ్ స్టీఫెన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలతో తీర ప్రాంతాలు కాలుష్యమవుతున్నాయన్నారు. అంతే కాకుండా మత్స్య సంపద నాశనం కావడంతో పాటు తీర ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుపోతుందన్నారు. ఈ క్రమంలో తీర ప్రాంత బీచ్ పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై బీచ్ సందర్శకులకు అవగాహన సదస్సు ద్వారా వివరించారు. కార్యక్రమంలో సాగరమిత్ర ఇన్‌చార్జి ముత్యాల సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రమేష్, సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, ముత్యాల అయ్యప్ప, చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఫిజికల్ సైన్స్ టీచర్ ఫణికుమార్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నంలో..

ముత్తుకూరు : మండలంలోని కృష్ణపట్నం సముద్ర తీరంలో ‘ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే’ శనివారం సందడిగా జరిగింది. కృష్ణపట్నం ఇండియన్ కోస్టు గార్డు ఆధ్వర్యంలో బీచ్‌లో చెత్తా చెదారాలను శుభ్రం చేశారు.

పెద్దపాళెంలో..

విడవలూరు : మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామ తీరంలో స్వచ్ఛసాగర్– సురక్షిత్ సాగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తీరం వెంబడి ఉన్న చెత్తా చెదారాలను స్థానికులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొని, శుభ్రం చేశారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల పోలయ్య, కొండూరి శ్రీనివాసులు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలకు సముద్రం దేవుడు ఇచ్చిన వరం అని, ఎంతో మంది మత్స్యకార కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తోందని తెలిపారు. అలాంటి సముద్రాన్ని శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత తీరం వెంబడి ఉన్న ప్రతి మత్స్యకారుడిపై ఉందన్నారు. సముద్రాన్ని కాలుష్యరహితంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం సముద్రతీరం వద్ద ఉన్న వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో గ్రామ కాపులు కొండూరు పోలయ్య, అక్కయ్యగారి ఆనందరావు, శ్రీహరికోట తిరుపతి, సున్నపు పాపారావు, మోహన్, తాతయ్య, తిరుపతి, మెరైన్ సిబ్బంది మల్లికార్జున, రమణయ్య, సురేష్, వినోద్, పంచాయతీ కార్యదర్శి సార్ముడి స్వచ్ఛందంగా పాల్గొని తీరం వెంబడి వ్యర్థాలను తొలగించారు.


తోటపల్లిగూడూరు : కోడూరు బీచ్‌లో క్లీనింగ్ చేస్తున్న మత్స్యకార ప్రతినిధులు


విడవలూరు : స్వచ్ఛసాగర్‌లో పాల్గొన్న గ్రామస్తులు, అధికారులు

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి


మనుబోలు : గర్భిణులకు సీమంతాలు జరిపిస్తున్న అంగన్‌వాడీలు


కొడవలూరు : దామేగుంటలో..


పొదలకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ


తోటపల్లిగూడూరు : డక్కులవారిపాళెంలో..

మనుబోలు : వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, రమణమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వడ్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు జరిపించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు వసుంధర, భారతి, వెంకటరమణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం అంగన్‌వాడీ(ఎస్టీ) కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాల్సిందిగా సూచించారు. తక్కువ ఖర్చుతో అధిక కేలరీలు అందజేసే పౌష్టికాహారం తయారీ విధానాన్ని వివరించారు. తృణధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుప్రజ, ఎంఎస్‌కే సంపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, జ్యోతి, అనసూయ, సునీత, నాగసుధామణి, తల్లులు పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు : తోటపల్లి పంచాయతీ డక్కులవారిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విమలమ్మ, సక్కుబాయి, లక్ష్మీప్రియ, పోలమ్మ, భాగ్యమ్మ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.
- కొడవలూరు : మండలంలోని దామేగుంటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు శనివారం సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ వసుంధర, ఏఎన్ఎం రవళి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణమ్మ, స్వర్ణలత, మాధవి, జయశ్రీ పాల్గొన్నారు.

‘గురజాడ’కు ఘన నివాళి

విడవలూరు : స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కవి గురజాడ అప్పారావు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధ్యాపకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గురజాడ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.సుజాత, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మధు, అధ్యాపకులు జి.పద్మప్రియ, ఎం.వెంకటరమణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడమగట్టు కాలువకు నీటి విడుదల

పొదలకూరు : కండలేరు ఎడమగట్టు కాలువకు తెలుగుగంగ అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. మెట్టపంటల రైతులు పంటలను కాపాడుకునేందుకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచన మేరకు ఒక మోటారు ద్వారా 130 క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

23న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు


ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

ముత్తుకూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు రెండు రోజుల పాటు జరిగిన క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లకు సంబంధించి 150 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, ఇందులో గెలుపొందిన విద్యార్థులు పొదలకూరులో ఈనెల 23వ తేదీన జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివిధ హైస్కూళ్ల పీఈటీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

విడవలూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరిస్తామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామతీర్థం గ్రామం ఎస్టీ కాలనీలో శనివారం జరిగిన ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని కోదండరామస్వామి ఆలయంలో పూజలు జరిపించారు. అనంతరం ఎస్టీకాలనీలో పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీనివాసులు, వాసు, గోవర్ధన్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.